
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
సోమవారం 1 జూలై 2024



ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్, జూన్ 30: మండల పరిధి తెలంగాణ మోడల్ కళాశాలలో నలుగురు ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతిచ్చిందని కళశాల ప్రిన్సిపాల్ శ్రీవాచ్ఛ్య ఆదివారం తెలిపారు. మోడల్ స్కూల్, కళాశాలల్లో హెచ్‌బీటీ, పీజీటీ, మ్యాథ్స్ టీజీటీ సైన్స్ టీజీటీ హిందీ బోధనకు ఒక్కో పోస్టు ఖాళీ ఉన్నాయన్నారు. అవర్లీ బేస్డ్ విధానంలో ఒక్కో పీరియడ్‌కు రూ.183 చొప్పున వంద పీరియడ్లకు రూ.18,200 వేతనం ఉంటుందని తెలిపారు. ఎంఎస్సీ మాథ్స్, ఎంఎస్సీ సైన్స్(బాటనీ, జువాలజీ), బీఎస్సీ సైన్స్, ఎంఏ హిందీ/బీఎడ్ అర్హత కలిగిన వారు జూలై 2వ తేదీలోగా మోడల్ స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

మహేశ్వరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

▸ జడ్పీ చైర్‌పర్సన్ టి.అనితాహరినాథ్‌రెడ్డి

మహేశ్వరం, జూన్ 30 : ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, మహేశ్వరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి మరో నగరంగా తీర్చి దిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారని జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నందుపల్లి, నాగారం, పెండ్యాల, రామచంద్రగూడ, ఉప్పుగడ్డతండా, హర్షగూడ, గంగారం, మహేశ్వరం గ్రామాల్లో ఆదివారం రూ.1.7కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఆమె మాట్లాడుతూ ఐదేళ్లుగా జిల్లాలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తుందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెనకడుగు వేయరని, ఎన్ని నిధులైనా కేటాయించి ప్రజల అవసరాలను తీరుస్తారన్నారు. భవిష్యత్తులో మహేశ్వరం అభివృద్ధిలో ఓ మహా నగరంగా మారబోతుందని, అందుకు ముఖ్యమంత్రి తగిన ప్రణాళికలను తయారు చేశారన్నారు. ఎక్కువగా తండాలున్న మహేశ్వరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తండాల్లో, గ్రామాల్లో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, విద్య, వైద్యం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వీధి దీపాలు వంటి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.సునీతఅంద్యానాయక్, ఎంపీడీవో శైలజారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నవత, వివిధ శాఖల అధికారులు, నాయకులు మల్లేష్‌యాదవ్, నర్సింహయాదవ్, కంది రమేష్, దశరథ్, రాఘవేందర్‌రెడ్డి, కృష్ణానాయక్, లాజర్, అంజయ్య, రాజునాయక్, రవినాయక్, చిన్నశాంతి పాండు, ఆజం, యాదయ్య, పాండునాయక్ పాల్గొన్నారు.



▸ 'బడి బాట'కు స్పందన అంతంత మాత్రమే

▸ ఒకటో తరగతిలో 8వేల మందే ప్రవేశం

▸ అడ్మిషన్లు తగ్గితే టీచర్ పోస్టులపై ఎఫెక్ట్!

ప్రభుత్వ బడుల్లో వివిధ తరగతుల్లో విద్యార్థులను చేర్చుకునే ఉద్దేశంతో ఏటా ప్రభుత్వం నిర్వహిస్తున్న బడి బాట కార్యక్రమం జిల్లాలో ఈ సారి పెద్దగా ఫలితాన్ని ఇవ్వలేదు. ఈ విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో కనీసం 15వేల మంది విద్యార్థులను చేర్పించాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 8,015 మంది మాత్రమే అడ్మిషన్లు పొందినట్టు విద్యాశాఖ లెక్కలు చెబుతున్నాయి. బడి బాట నిర్వహణ, విజయవంతంపై విద్యాశాఖ అధికారులు అంతగా శ్రద్ధ పెట్టకపోవడం, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలపై తల్లిదండ్రులకు విడమర్చి చెప్పడంలో విఫలమయ్యారే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇదిలా ఉంటే బడి బాట సమయంలోనే ప్రభుత్వం నిర్వహించిన టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ కూడా బడి బాటపై ప్రభావం చూపిందనే వాదనా విన్పిస్తోంది.

లక్ష్యం చేరని బాట

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

విద్యార్థులు మళ్లీ ప్రైవేటు స్కూళ్లబాట పడుతున్నారు. గడిచిన కొన్నేళ్లుగా ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాలు పెరుగుతూ వస్తున్నా ఈ ఏడాది మాత్రం సర్కార్ స్కూళ్లలో ప్రవేశాలు అంతంతమాత్రంగానే జరిగాయి. ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాలను పెంచేందుకు ప్రతి ఏటా నిర్వహిస్తున్న బడి బాట కార్యక్రమానికి ఈ సారి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. బడి బాట కార్యక్రమం ప్రారంభంలో ముమ్మరంగా సాగినా కొన్ని రోజుల్లోనే నీరుగారి ఆశించిన స్థాయిలో ఫలితాన్నివ్వలేదు. ఈ ఏడాది బడి బాట కార్యక్రమాన్ని ఈ నెల 6 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఏటా వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునః ప్రారంభ సమయంలో కొన్నేళ్లుగా ఈ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు. ఈ సారీ ప్రభుత్వం బడి బాట నిర్వహించింది. గ్రామాలు, పట్టణాల్లో పండగ వాతావరణంలో నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కార్యాచరణ రూపొందించింది. బడీడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు, ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదై ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని అవగాహన ర్యాలీలు, ఇంటింటి ప్రచారం చేయాలని ఆదేశించింది. ఈ కార్యక్రమ బాధ్యతలను ప్రధానోపాధ్యాయులకు అప్పగించింది. పలుచోట్ల ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి సర్కారు బడుల్లో కల్పిస్తున్న సదుపాయాలు, ఫలితాలను తల్లిదండ్రులకు వివరించారు. అయితే ఈ కార్యక్రమం కింద జిల్లాలో ఒకటో తరగతిలో సుమారు 15వేల మందిని చేర్పించాలని లక్ష్యంగా నిర్ణయించగా 8,015 మందినే చేర్పినట్టు అధికారులు రికార్డుల్లో నమోదు చేశారు. బడి బాట కార్యక్రమంపై విద్యాశాఖ అధికారులు పూర్తిస్థాయిలో శ్రద్ధపెట్టకపోవడం కూడా ప్రవేశాలు ఆశించిన స్థాయిల్లో పెరగకపోవడానికి కారణంగా చెబుతున్నారు. ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీల వ్యవహారంలో తలమునకలై ఉండడడంతో వారంతా బడిబాటపై శ్రద్ధ పెట్టలేదు.



మాడ్గుల మండలం దొడ్లపహాడ్‌లో బడి బాట ర్యాలీ(ఫైల్)

ప్రభుత్వ స్కూళ్లపై తల్లిదండ్రుల విముఖత

తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చేర్పించేందుకే ఆసక్తిచూపుతున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు ఆశించిన స్థాయిలో మౌలిక సదుపాయాలు లేకపోవడం, అనేక స్కూళ్లలో టీచర్ల కొరత, పాఠశాలల నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడం, పోటీ ప్రపంచానికి అనుగుణంగా సర్కారు బడుల్లో బోధన లేకపోవడం తదితర కారణాలతో తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లకు పంపే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. చాలా ప్రభుత్వ స్కూళ్లలో ఒకటో తరగతిలో సుమారు 100 వరకు అడ్మిషన్లు జరగాల్సి ఉండగా 30 నుంచి 40 కూడా ప్రవేశాలు జరగలేదు. ఈ కారణంగా ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాల ఆశించిన మేర పెరగలేదు. గత ఏడాది ఒకటో తరగతిలో సుమారు 11వేల మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాలు చేయగా ఈ ఏడాది ఇప్పటి వరకు 8,015 మంది మాత్రమే జాయిన్ అయ్యారు. వీరిలో అంగన్వాడీల నుంచి 4,043

విద్యార్థుల సంఖ్య తగ్గితే టీచర్ పోస్టులపై ఎఫెక్ట్!

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు ఆశాజనకంగా లేకపోవడంతో జిల్లాలో టీచర్ పోస్టుల సంఖ్యపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. విద్యార్థుల సంఖ్య ఆధారంగానే ఉపాధ్యాయ పోస్టులు కేటాయిస్తారనే విషయం తెలిసిందే. విద్యార్థుల సంఖ్య తగ్గితే క్రమబద్ధీకరణ ద్వారా ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గిస్తారు. సాధారణంగా పదో తరగతి తరువాత స్కూల్ విడిచే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మిగతా తరగతుల్లో విద్యార్థుల సంఖ్య పెరగాల్సి ఉంటుంది. నూతన విద్యా సంవత్సరంలో ఈ మేర ప్రవేశాలు పెరిగితే స్కూళ్లకు ఢోకా ఉండదు. అయితే మళ్లీ ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాలు తగ్గడంతో స్కూళ్ల సంఖ్యపై కూడా ప్రభావం పడుతుంది. అంతేకాక భవిష్యత్తులో ఉపాధ్యాయ పోస్టులు కూడా తగ్గుతాయి. ఈ కారణంగా ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులతో పాటు కొత్తగా డీఎస్సీ ద్వారా ఉద్యోగానికి ఎంపికవుదామనుకునే నిరుద్యోగులకు కూడా నష్టం జరుగుతుంది.



చేవెళ్లలో బడి బాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు(ఫైల్)

మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. ప్రైవేటు స్కూళ్ల నుంచి కేవలం 361 మంది విద్యార్థులు మాత్రమే కొత్తగా ప్రభుత్వ స్కూళలో జాయిన్ అయ్యారు. ఇదిలా ఉంటే ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు ఇంకా కొనసాగుతున్నాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం

▸ కార్మికులకు అండగా నిలుస్తాం

▸ ఊరూరా తిరిగి పార్టీని బలోపేతం చేస్తాం

▸ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు



విలేకరులతో మాట్లాడుతున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, జూన్ 30 : తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. షాద్‌నగర్‌లోని తన నివాసంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘనవిజయం సాధించడంతో తెలంగాణ టీడీపీలోనూ నూతనోత్సాహం నెలకొందన్నారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న వారంతా తిరిగి హాజరవుతున్నారని తెలిపారు. పార్టీకి పునర్వైభవం తెచ్చి, 2028 ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా పార్టీని బలోపేతం చేసేలా ఊరూర టీడీపీ జెండా పండుగలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా చైతన్య కార్యక్రమాలను చేపడుతామన్నారు. సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. బీఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్యంతో రైతులు, పరిశ్రమల కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వారందరికీ టీడీపీ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, కట్టు కాలువలు, బండ్ల బాటల పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషిచేస్తామని అన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరమాచినేని రత్నాకర్ మాట్లాడుతూ.. బూర్గుల శివారులోని సౌత్‌గ్లాస్ ఫ్యాక్టరీ యాజమాన్యం, అధికారుల నిర్లక్ష్యం వల్లే పరిశ్రమలో ప్రమాదం జరిగిందన్నారు. యాజమాన్యంపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, మృతులకు న్యాయమైన ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. భువనగిరి, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాల టీడీపీ అధ్యక్షులు కృష్ణమాచారి, అశోక్‌కుమార్‌గౌడ్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీకి 20ఏళ్ల నుంచి అధికారంలో లేకున్నా బలమైన క్యాడర్, ప్రజాభిమానం ఉందన్నారు. 2028 ఎన్నికల్లో ఎన్డీఏ అధికారమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు లింగారం కుమార్‌గౌడ్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రకాష్, రామకోటేశ్వర్‌రావు, బండారి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాజకీయ చైతన్యం

షాద్‌నగర్ రూరల్: టీడీపీతోనే ప్రజల్లో రాజకీయ చైతన్యం వచ్చిందని బక్కని నర్సింలు అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం బూర్గులలో ఆదవారం పార్టీ జెండాను ఎగురవేశారు. ప్రజలు అభివృద్ధి, సంక్షేమాన్ని సాధించుకోవాలన్నారు. ప్రజలను ఓటు బ్యాంక్‌గా మార్చుకొని పబ్బం గడుపుకునే పార్టీలను ప్రజలు నమ్మరని తెలిపారు. కేసీఆర్ పథకాల పేరుతో ప్రజాధనాన్ని ధనికులకు దోచిపెట్టారని ఆరోపించారు. బూర్గులకు గొప్ప చరిత్ర ఉందని గుర్తుచేశారు. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన బూర్గుల రామకృష్ణారావు నాడు రాష్ట్రాన్ని విశాలాంధ్ర కోసం విలీనం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకర్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, మోహన్‌రావు పాల్గొన్నారు.

సమతామూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి

▸ చిన జీయర్‌స్వామి ఆశీస్సులు తీసుకున్న పియూష్ గోయల్

శంషాబాద్ రూరల్, జూన్ 30 : మండలంలోని ముచ్చింతల్ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ ఆదివారం సందర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి స్ఫూర్తి కేంద్రానికి వచ్చిన కేంద్ర మంత్రికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ రామానుజుల స్వర్ణ విగ్రహానికి పూజలు నిర్వహించారు. అలాగే దివ్య దేశ ఆలయాలను సందర్శించారు. అనంతరం చిన జీయర్ ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా జీయర్‌స్వామి కేంద్ర మంత్రి కుటుంబీకులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మూడు గంటలపాటు ఆలయంలో గడిపారు. వారికి చిన జీయర్‌స్వామి ఆలయ ప్రత్యేకతలను వివరించారు. అనంతరం కేంద్రమంత్రి ప్రత్యేక కాన్వాయ్‌లో ఎయిర్‌పోర్ట్‌కు చేరుకొని అక్కడి నుంచి ఢిల్లీ వెళ్లారు. ఆయన వెంట మై హోం గ్రూప్ అధినేత జూపల్లి జగపతిరావు ఉన్నారు.



పియూష్ గోయల్‌కు సమతామూర్తి ప్రతిమ అందజేస్తున్న చిన జీయర్‌స్వామి

ఎన్నికల ఖర్చు వివరాలను గడువులోగా సమర్పించాలి

▸ వివరాలు అందజేయకుంటే పోటీచేసిన వారిపై అనర్హత వేటే


▸ మూడేళ్ల వరకు పోటీకి అనర్హులు

▸ ఎన్నికల వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమార్, రాజీవ్ చాబ్రా

రంగారెడ్డి అర్బన్, జూన్ 30 : ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికల ఖర్చు వివరాలను గడువు లోపు అందజేయాలని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమార్, రాజీవ్ చాబ్రా అన్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అభ్యర్థులంతా ఎన్నికల సందర్భంగా చేసిన ఖర్చు మొత్తాలను సరి చూసుకుని, వివరాలను నిర్ణీత గడువు లోపు ఇవ్వాలని వ్యయ పరిశీలకులు సూచించారు. పోటీచేసిన అభ్యర్థుల ఖర్చుల వివరాలను సరిపోల్చుకునేందుకు వీలుగా జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆదివారం రికన్సిలేషన్‌ను నిర్వహించారు. వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమార్, రాజీవ్ చాబ్రా విచ్చేసి అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలను వ్యత్యాసాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతీ అభ్యర్థి ఎన్నికల ఖర్చుకు సంబంధించి రోజువారీ ఖాతా రిజిష్టర్, నగదు లావాదేవీల రిజిష్టర్, బ్యాంక్ రిజిష్టర్, స్టేట్‌మెంట్ షెడ్యూల్‌లోని ఒకటి నుంచి పదకొండు గల ఎన్నికల ఖర్చుల వివరాలను సరి చూసుకొని క్రమసంఖ్యతో కూడిన అన్ని బిల్లులు, వోచర్లు, ఒరిజినల్ అఫిడవిట్, స్వీయ ధ్రువీకరణతో కూడిన బ్యాంకు స్టేట్‌మెంట్ తదితర వాటిని ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు నుంచి ఎన్నికల సంఘం నిర్దేశించిన సమయం లోపు సమర్పించాలని వారు తెలిపారు. ఇందుకు త్వరలోనే గడువు ముగియనున్న నేపథ్యంలో రికన్సిలేషన్ ఏర్పాటు చేశామని చెప్పారు. బ్యానర్లు, వాల్ పోస్టర్లు, వార్తా పత్రిలు, టీవీ చానెళ్లలో ఇచ్చిన యాడ్స్ వివరాలు, ఖర్చుల వివరాలు తెలియజేయాలన్నారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లకు ఖర్చుల వివరాలను సరైన విధానంలో సమర్పించేలా ఏఈఓలు మార్గనిర్దేశం చేస్తున్నారన్నారు. ఎన్నికల ఖర్చుల వివరాలను సకాలంలో, నిర్ణీత ఫార్మాట్‌లో అందజేయకుంటే అలాంటి వారికి నోటీసులు జారీచేస్తామన్నారు. నిర్ణీత కాల వ్యవధి లోపు లెక్కలు ఇవ్వని వారిపై ప్రజా ప్రాతినిధ్య చట్టం, సెక్షన్-10ఏ ప్రకారం అనర్హత విధించాలని ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాస్తామని స్పష్టం చేశారు. ఈసీ ద్వారా అనర్హులుగా ప్రకటించబడిన వారు మూడేళ్ల వరకు ఎన్నికల్లో పోటీకి అవకాశం కోల్పోతారని అన్నారు. సమావేశంలో జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ అధికారి సురేష్ మెహన్, చేవెళ్ల నియోజక వర్గం నుంచి పోటీ చేసిన అభ్యర్థుల ఏజెంట్లు, ఏఈవోలు పాల్గొన్నారు.



ఖర్చుల వివరాలను తెలుసుకుంటున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమార్, రాజీవ్ చాబ్రా



కళకళలాడుతున్న మొక్కజొన్న చేను

ముసురు వర్షం.. రైతుల హర్షం

▸ సాగు పనులతో వ్యవసాయ క్షేత్రాలు కళకళ

ఆమనగల్లు, జూన్ 30 : రెండు రోజులుగా కురస్తున్న ముసురుతో వ్యవసాయ క్షేత్రాలు రైతులు, కూలీలతో సందడిగా మారాయి. ఆమనగల్లు మండలంలో తొలకరి వర్షాలకు వేసిన మొక్కజొన్న, పత్తి చేలలో కలుపు తీత పనులు చేస్తున్నారు. మొక్కలకు ఎరువు వేస్తున్నారు. వ్యవసాయ పనులతో కూలీలకు ఉపాధి లభిస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే పంటలు చాలా వరకు సాగయ్యాయి. రోహిణి కార్తెలో వేసిన మొక్కజొన్న చేలు ఎదిగి కళకళలాడుతున్నాయి. ఆమనగల్లు ప్రాంతంలో పత్తి ఎక్కువ సాగు చేశారు. మూన్నాలుగు రోజుల కిందటి వరకు ఎండలతో వాడిన మొక్కలు తాజా ముసురు వానతో పచ్చగా కనువిందు చేస్తున్నాయి.

డ్రెయిన్ల నిర్వహణ మృగ్యం


▸ ఏ గ్రామంలో చూసినా అస్తవ్యస్తం!

▸ దోమలతో వేగలేకపోతున్న జనం

▸ మోరీల దుర్వాసన భరించలేక సతమతం

▸ పట్టించుకోని పంచాయతీ అధికారులు

యాచారం, జూన్ 30 : పంచాయతీ అధికారులు మురుగు కాలువలను శుభ్రం చేయించక, దోమల బెడదను నివారించకపోవడంతో రోజూ సాయంత్రం నుంచి దోమలు, పగటిపూట ఈగలతో జనం బెంబేలెత్తుతున్నారు. దోమల నివారణకు ఉపయోగించాల్సిన ఫాగింగ్ మిషన్లు పంచాయతీ కార్యాలయల్లో మూలుగుతున్నాయి. పంచాయతీ సిబ్బంది మురుగుకాలువలు శుభ్రం చేయక ఎక్కడికక్కడ మురుగు పేరుకుంటోంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇళ్ల వద్ద దుర్గంధం వస్తోంది. ఏళ్ల కింద కట్టిన ఓపెన్ డ్రెయిన్లు శిథిలమైనా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎస్సీ బస్తీల్లో మురుగు కాలువలు అస్తవ్యస్తంగా మారాయి.



యాచారం మండలం చౌదర్‌పల్లిలో మురుగు కాలువల దుస్థితి

ఏ కొన్నో తప్పితే చాలా గ్రామాల్లో ఓపెన్ డ్రెయిన్లే ఉన్నాయి. వాటిల్లో పూడిక తీయక నీరు నిలుస్తూ కాలువలు పొంగుతున్నాయి. దోమల బెడదతో రాత్రిపూట జాగారం చేస్తున్నామని నందివనపర్తి వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వీధుల్లో మురుగు గుంతలు పూడ్చేయించాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మేడిపల్లిలో మురుగు నీరు పాఠశాల ఆవరణలోకి చేరి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. గున్గల్‌లో మురుగు నీటిని పొలాల్లోకి మళ్లించడంతో తన పొలం పాడవుతోందని రైతు విజయ్ ఎంపీవో శ్రీలతకు ఫిర్యాదు చేశాడు. నల్లవెల్లిలో పంచాయతీ కార్యాలయం ముందు నుంచి మురుగు నీరు పారుతోంది. యాచారంలోని పుడమి పాఠశాల సమీపంలో భారీ మురుగు నీటి గుంత దోమలకు నిలయమైంది. అబ్బసాప్ కుంటలోకి మురుగు నీటిని మళ్లించడంతో దోమల బెడద ఎక్కువైందని గాండ్లగూడ, యాచారం వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇలా చాలా గ్రామాల్లో డ్రెయిన్ల నిర్వహణ లేక ప్రజలు దుర్వాసన, దోమలు, ఈగలతో ఇబ్బందులు పడుతున్నారు. ముందే రోగాల వ్యాప్తి కాలం కావడంతో పారిశుధ్య లోపంతో విష జ్వరాలు, మలేరియా వంటి వ్యాధులు సోకుతాయని జనం జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పత్తాలేని ఫాగింగ్ మిషన్లు

దోమలను నివారణకు పంచాయతీలకు ప్రభుత్వం ఫాగింగ్ మిషన్లు ఇచ్చింది. సర్పంచుల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి ఫాగింగ్ మిషన్లు మూలకు పడ్డాయి. వాటితో దోమలను నివారించడంలో ప్రత్యేకాధికారులు విఫలమయ్యారు. వారు గ్రామాలకు చుట్టపు చూపుగా వచ్చి పది నిమిషాల గడిపి వెళ్తున్నారు. కానీ ప్రజలు పడుతున్న ఇబ్బందులపై మాత్రం దృష్టి పెట్టడం లేదు.

దోమలతో వేగలేకపోతున్నాం



మా ఇంటి ముందు ఐదేళ్ల కింద మురుగు కాలువ పాడైంది. కొత్తగా భూగర్భ డ్రైనేజీ నిర్మించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. దుర్వాసన, దోమలు, ఈగలతో నరకం అనుభవిస్తున్నాం. భోజన సమయంలో దుర్వాసన వస్తుండంతో వాంతి చేసుకుంటున్నాం. కాలువ పూడ్చి భూగర్భ డ్రైనేజీ నిర్మించాలి.

- సరిత, చౌదర్‌పల్లి

రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న నాగలింగాచారి

యాచారం, జూన్ 30 : రైతుల ఆర్థికాభివృద్ధితో పాటు వారిని అన్నివిధాలా ఆదుకునేందుకే ప్రభుత్వం కృషి చేస్తుందని, రైతు భరోసా పథకం వర్తింపుపై రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తుందని మేడ్చల్ జిల్లా సహకార శాఖాధికారి నాగాలింగాచారి తెలిపారు. రైతుల కడగండ్లు తీర్చడం కోసం ప్రభుత్వం రైతు భరోసా ద్వారా అందించే సాయంపై వివిధ విషయాలపై రైతుల అభిప్రాయాలను సేకరిస్తుందని, వారి సూచనలు, సలహాలు ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఆయన చెప్పారు. ఆదివారం యాచారం మండల కేంద్రంలో రైతు భరోసాపై రైతువేదిక భవన్‌లో ప్రజాప్రతినిధులు, రైతుల నుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం రైతులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఆర్థిక చేయూతనిందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తుందని తెలిపారు. కనీసం 9 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించాలని యాచారం ఎంపీపీ కొప్పు సుకన్యబాషా అభిప్రాయం వ్యక్తం చేశార. గత ప్రభుత్వ కాలంలో రెండు మూడు ఎకరాలున్న రైతులకు కూడా రైతుబంధు, రైతుబీమా సాయమందలేదని, ధరణి పోర్టల్‌లోని లోపాలే ప్రధాన కారణమన్నారు. సమావేశంలో మండల సొసైటీ ఛైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ కారింగ్‌యాదయ్య, జెడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ, మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్, సొసైటీ సభ్యులున్నారు.

ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం

షాద్‌నగర్ అర్బన్, జూన్ 30: ఫరూఖ్‌నగర్ మండలంలోని చిల్కమర్రి గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీశైలం ఇంటి నిర్మాణానికి.. అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రవీందర్‌రెడ్డి రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో రూ.20వేల చెక్కును ఆదివారం శ్రీశైలంనకు ఇప్పించారు. అనంతరం చిల్కమర్రి గ్రామంలో వివిధ కారణాలతో మరణించిన కుటుంబాలకు రవీందర్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. చెనిగారి నర్సింగ్‌రావు కుటుంబానికి రూ.5వేల, పెద్దసాయి రమేష్ కుటుంబానికి రూ.4వేలు, కె.శ్యామలమ్మ కుటుంబానికి నాలుగున్నర వేల రూపాయలు అందజేశారు. రవీందర్‌రెడ్డిని ఎమ్మెల్యే శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందించారు.


చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శంకర్, పక్కన రవీందర్‌రెడ్డి

వైభవంగా కట్టమైసమ్మ బోనాలు

మేడ్చల్ టౌన్, జూన్ 30: మేడ్చల్ పట్టణంలో కట్టమైసమ్మ బోనాల ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం నుంచి ప్రారంభించిన బోనాల ఉత్సవాల్లో పాల్గొనటానికి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తుల కోసం పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. మేడ్చల్ పట్టణానికి చెందిన వేముల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, బాలమల్లేష్, శ్రీనివాస్‌గౌడ్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


కట్ట మైసమ్మ ఆలయంలో గ్రామస్తుల పూజలు

పశుబలిపై పుకార్లు

కట్టమైసమ్మ బోనాల సందర్భంగా నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా దున్నపోతును బలి ఇవ్వడం ఆనవాయితీగా వస్తున్నందున ఈసారి కూడా పశువును బలి ఇస్తున్నట్లు పుకార్లు రావటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అమ్మవారి బోనాల సందర్భంగా వారం రోజుల కిందట ఒక దున్నపోతును ఊరులో వదిలారని ఆ పశువును బోనాల సందర్భంగా బలి ఇస్తున్నారని స్థానికంగా పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. దీంతో స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. ఉత్సవ వేడుకలు నిర్వహించే వారితో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించి పశుబలి ఇవ్వటం లేదన్న విషయాన్ని నిర్ధారించుకుని ఆలయం వద్ద బందోబస్తును ఏర్పాటు చేశారు. పశుబలి ఇస్తున్న విషయంలో వాస్తవం లేదని, కేవలం కొందరు అసత్య ప్రచారం చేశారని మేడ్చల్ సీఐ సత్యనారాయణ స్పష్టం చేశారు.

కాలనీల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు

● మార్నింగ్ వాక్‌లో పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి


మార్నింగ్ వాక్‌లో స్థానికులతో చర్చిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, జూన్ 30: కాలనీల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు చేపడతామని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మార్నింగ్ వాక్‌లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని ఇస్మాయిల్ ఖాన్‌గూడలో వివిధ కాలనీల్లో ఆదివారం స్థానికులతో కలిసి పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా నవదుర్గ కాలనీ ఫేస్-1లో గల పార్కును అభివృద్ధి చేయాలని కాలనీ వాసులతోపాటు కౌన్సిలర్ గొంగళ్ల మహేష్ కోరిక మేరకు తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. పార్కులో మొక్కలు నాటించడంతోపాటు వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కాలనీల్లో డఅసోసియేషన్ల నిర్వాహకులు, యువజనసంఘాల సభ్యులు పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రధానంగా చెత్తను వీధుల్లో వేయకుండా తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపాలిటీ వాహనాలలోనే వేయాలన్నారు. రోడ్ల పక్కన, వీదుల్లో చెత్త పడవేయడం వలన పరిసరాలు కలుషితమై ప్రజలు అనారోగ్యాల బారిన పడేప్రమాదమున్నందున ప్రతీఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీకాంత్, గంగాధర్, భాస్కర్, రఘుపతి, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర అభ్యాసాన్ని అలవర్చుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 30: విద్యార్థులు నిరంతర అభ్యాసాన్ని అలవర్చుకోవాలని ఏడీఎం కార్పోరేట్ సంస్థ వైస్‌ప్రెసిడెంట్ సంజయ్ చురివాల అన్నారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో 1వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సంజయ్ చురివాల మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో నైపుణ్యాలను సృష్టించాలన్నారు. అనంతరం జనగాం ఎమ్మెల్యే, అనురాగ్ యూనివర్సిటీ ఛైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదిగిన తరువాత సమాజ శ్రేయస్సుకోసం కృషిచేయాలన్నారు. నూతన అవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. అనురాగ్ యూనివర్సిటీలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు గుర్తుచేశారు. మొట్టమొదటి వార్షికోత్సవంలో 1600మంది విద్యార్థులు గ్రాడ్యుయేట్లకు సర్టిఫికెట్లు అందజేయగా టాపర్లకు నగదు బహుమతి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ సీఈవో సూర్యదేవర నీలిమ, వైస్ చాన్సలర్ డాక్టర్ అర్చన, రిజిస్ట్రార్ బాలాజీ ఊట్ల, డీన్లు డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఎం కార్పొరేట్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ చురివాల, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కుర్మిద్ద పాల ఉత్పత్తిదారుల సంఘం

అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి


మహేందర్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న కిషన్‌రెడ్డి

యాచారం, జూన్ 30 : మండలంలోని కుర్మిద్ద పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం అధ్యక్షుడిగా బందె మహేందర్‌రెడ్డి ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 250 మంది సభ్యులున్న సొసైటీలో మహేందర్‌రెడ్డి వరుసగా పదోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతులకు అందించే పథకాలను ప్రతీ రైతుకందేలా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఇప్పటివరకు కుర్మిద్ద సొసైటీకి రూ.7లక్షల లాభం వచ్చిందన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

'గిరి వికాసం'తో బీడు భూముల్లో సాగు


మాట్లాడుతున్న మాధురి

ఆమనగల్లు, జూన్ 30: గిరి వికాసం పథకం కింద గిరిజనుల బీడు భూములను సాగులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంపీడీవో కుసుమ మాధురి తెలిపారు. సన్న, చిన్నకారు రైతులకు ఈ పథకం ద్వారా బోరు, విద్యుత్, మోటార్ ఉచితంగా అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలో గిరి వికాసం పథకం గురించి కుసుమ మాధురి వివరించారు. గిరిజన రైతులను ఆదుకొని.. వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన గిరి వికాస పథకానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈజీఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను పథకం వివరాల కోసం సంప్రదించాలని, మండలంలో మేడిగడ్డ, రాంనుంతల గేటు తండాలను మొదటి విడత పథకం కింద ఎంపిక చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఐదెకరాలలోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు ఈ పథకం ద్వారా లబ్ధి కలుగుతుందని కుసుమ మాధురి వివరించారు. గిరి వికాసం పథకం ద్వారా లోగడ గిరిజన రైతులకు ఇచ్చిన వ్యవసాయ భూముల్లో బోర్లు వేసి వాటిని సాగుకు యోగ్యంగా మార్చాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. డీఆర్‌డీఏ ద్వారా ఈ పథకం అమలు చేయడం జరుగుతుందని కుసుమ మాధురి తెలిపారు.



ప్రమాదభరితంగా మూలమలుపు

ఆమనగల్లు, జూన్ 30: ఆమనగల్లు-మాడ్గుల రోడ్డులో జంగారెడ్డి పల్లి వద్ద మూల మలుపు ప్రమాదభరితంగా మారింది. చెరువు వద్ద ఏమాత్రం ఆదమరిచినా ప్రాణాలకే ప్రమాదం. ఇటీవల డబుల్ రోడ్డుగా విస్తరించినా.. మూల మలుపు వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. రోడ్డులో రెండు మూడు చోట్ల మూల మలుపులు ఉండడం వల్ల కొన్నిసార్లు ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దాంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మూడేళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో ఓ ఏఎస్సై ఈ మూల మలుపు వద్దే చనిపోయాడు. ఒక వైపు చెరువు, మరో వైపు గుట్ట ఉండడం వల్ల రోడ్డు ప్రమాదకరంగా మారింది. రాళ్లను తొలగించి రోడ్డును నేరుగా చేసి సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దశరథ్ నాయక్

సన్మార్గంతోనే దైవానుగ్రహం

కడ్తాల్, జూన్ 30: మానవాళి సన్మార్గ పురోగమనానికి, సమాజ శాంతి స్థాపనకు దైవ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని జడ్పీటీసీ దశరథ్ నాయక్ అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగేవారు ఆనందమయ జీవితాన్ని పొందుతారని పేర్కొన్నారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని ఆదివారం జడ్పీటీసీ దశరథ్‌నాయక్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో దశరథ్ నాయక్‌ను సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలు పంచుకోవాలని కోరారు. మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని మరింత తీర్చిదిద్ది భక్తులకు తగిన వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సన్మార్గంతోనే దైవానుగ్రహం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, శారద, బీక్యనాయక్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎస్సై రవీందర్

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

» మహేశ్వరం ఎస్సై రవీందర్

మహేశ్వరం, జూన్ 30 : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండడంతో పాటు చదువులో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని మహేశ్వరం ఎస్సై రవీందర్ సూచించారు. మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థ ఆధ్వర్యంలో మహేశ్వరంలో నిర్వహించిన కంప్యూటర్ శిక్షణలో భాగంగా కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు ఆదివారం ఉత్తీర్ణత పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై హాజరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో కష్టపడి చదివిస్తారని తెలిపారు. ప్రతీ ఒక్కరు ఉన్నత విద్యపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీష్, దేవేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలలను ప్రారంభించాలి

కులకచర్ల, జూన్ 30: మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలను ప్రారంభించాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు. కొత్త మండలం చౌడాపూర్‌కు 2022లో కేజీబీవీ పాఠశాల మంజూరైంది. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో అనువైన భవనం అద్దెకు లభించకపోవడంతో అధికారులు కేజీబీవీని ప్రారంభించడం లేదు. దీంతో ఈ విద్యాసంవత్సరం కులకచర్ల కేజీబీవీలో 6, 7 తరగతులు నిర్వహించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ఈక్రమంలో కులకచర్ల కేజీబీవీ ప్రిన్సిపాల్ విశ్వదేవి 6, 7తరగతులకు సంబంధించి బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కానీ విద్యాసంవత్సరం ప్రారంభమై 20రోజులు గడుస్తున్నా తరగతులు ప్రారంభించలేదు. దీంతో బాలికల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంఈవో హబీబ్ అహ్మద్‌ను వివరణ కోరగా దరఖాస్తులు తీసుకున్న విషయం తనకు తెలియదని ఎంఈవో హబీబ్ అహ్మద్ చెప్పడం గమనార్హం.

న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి



కృష్ణారెడ్డి

పరిగి, జూన్ 30: న్యాయవాది పరిషత్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పరిగికి చెందిన జి.కృష్ణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఆనంద్‌గౌడ్, నర్సింహ్మారావు, జింకల యాదయ్య తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన కార్యవర్గాన్ని సహచర న్యాయవాదులు సన్మానించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు కృషిచేస్తానని తెలిపారు. సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని చెప్పారు. కొత్తగా ఎన్నికైన కృష్ణారెడ్డి ఏజీపీ బి.వెంకట్‌రెడ్డి, యాదవ్‌రెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు.

విజయవంతమైన కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాల్మిక్ వైద్యులు

కొడంగల్ రూరల్, జూన్ 30: శ్రీసత్యసాయి భజన మండలి శంకర కంటి ఆసుపత్రి సంయుక్తాధ్వర్యంలో ఆదివారం కొడంగల్‌లోని అక్షర పాఠశాలలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కంటి వైద్యులు బాల్‌రాజ్, విజయ్‌కుమార్‌లు శిబిరానికి వచ్చిన ప్రజలకు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 125మందికి పరీక్షలు నిర్వహించగా అందులో 35మందికి కంటిలో శుక్లాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వీరిని ఆపరేషన్ల కోసం హైదరాబాద్‌కు రెఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, శ్రీసత్యసాయి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

భవిష్యత్ నిర్మాణంలో గ్రంథాలయాలది కీలక భూమిక

» పాఠకులు, నిరుద్యోగుల మనసు చూరగొన్న ఉపగ్రంథ పాలకుడు కిషన్‌గౌడ్

» ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పౌరగ్రంథాలయాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఏవీఎన్ రాజు

వికారాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చదువు నేర్చుకోవడంలో విద్యాసంస్థలు ఎంతటి పాత్ర పోషిస్తాయో ఉజ్వల భవిష్యత్తు నిర్మాణం చేసుకోవడంలో గ్రంథాలయాలు అంతే కీలక భూమిక పోషిస్తాయని పౌర గ్రంథాలయాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఏవీఎన్ రాజు అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కేంద్ర కార్యాలయంలో ఆదివారం కార్యదర్శి పి.సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన గ్రేడ్-1 ఉప గ్రంథ పాలకుడు కె.కిషన్‌గౌడ్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తన 36ఏళ్ల సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో కిషన్ విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, కలుపుగోలుతనంతో వ్యవహరించి ఎంతోమంది విద్యార్థులు, పాఠకుల మనస్సు దోచుకున్నారన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉంటూ తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించారని కొనియాడారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు, అభ్యర్థులు కోరిన పుస్తకాలను తెప్పించడానికి కిషన్ ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ అనేది తప్పదని, ప్రతీ ఉద్యోగి ఉద్యోగ విరమణ చేయాల్సిందేనన్నారు. విధి నిర్వహణలో మనం వ్యవహరించే తీరే మనకు పేరు తీసుకువస్తుందని చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు గ్రంథాలయాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని, సెలవురోజుల్లో కూడా సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. గ్రంథాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఉద్యోగ విరమణ చేసిన కిషన్ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని, భావితరాల జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన కిషన్, రాధ దంపతులను పౌర గ్రంథాలయ శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఏవీఎన్ రాజు, సంస్థ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల కార్యదర్శి మనోజ్‌కుమార్, నిజామాబాద్ జిల్లా కార్యదర్శి బుగ్గారెడ్డి, టీడీఎల్ ఎడ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్.కిషన్, ప్రభుత్వ డైట్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ బందెప్పగౌడ్, దిలీప్‌సింగ్, నర్సింహారెడ్డి, శివప్ప, భీంరాజ్, సంస్థ సిబ్బంది లక్ష్మప్ప, రమేష్, ముంజాత్, స్రవంతి తదితరులు శాలువాలు, పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.



కిషన్ దంపతులను సన్మానిస్తున్న ఏవీఎన్ రాజు, సురేష్

రైతులకు మరింత చేరువగా రైతునేస్తం

» బషీరాబాద్ రైతువేదికకు వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ మంజూరు

» ఇకపై అత్యాధునిక సాంకేతిక వ్యవస్థతో అన్నదాతలకు సలహాలు



నవాంద్గీ క్లస్టర్ రైతువేదిక



బషీరాబాద్(నవాంద్గీ) రైతు వేదికకు చేరిన వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ పరికరాలు

బషీరాబాద్, జూన్ 30: రైతు వేదికలో ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్న 'రైతునేస్తం' కార్యక్రమాన్ని విస్తృత పర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. మండలానికి ఒకటి చొప్పున రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌లను మంజూరు చేసింది. ఈ క్రమంలో మొదటి విడతగా బషీరాబాద్‌లోని (నవాంద్గీ) రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమాన్ని చేపట్టేందుకు వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ పరికరాలను సరఫరా చేసింది. అప్పట్లో ప్రయోగాత్మకంగా తొలుత ప్రతీ నియోజకవర్గంలో ఓ రైతు వేదికకు మాత్రమే వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించి అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేవారు. దీంతో రైతులకు మరింత చేరువగా రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. దీంతో ఒక్కో రైతువేదికకు వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ ఏర్పాటుకు రూ.370లక్షలను ప్రభుత్వం ఖర్చు చేసింది. వచ్చే నెల మొదటివారంలోగా రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వ్యవసాయాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సలహాలు, సూచనలు పొందొవచ్చు

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతుభరోసా, పంటల సాగు, రుణాలకు సంబంధించిన ఎలాంటి సందేహాలు ఉన్నా త్వరగా పరిష్కారమయ్యేందుకు శాస్త్రవేత్తలు, సంబధిత అధికారులు రైతులకు వివరిస్తారు. ఆయా పంటల సాగుకు, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై నిపుణులు అవగాహన కల్పిస్తారు. అదేవిధంగా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు ఎంత మోతాదులో వేయాలనే దానిపై సంబంధిత అధికారులు సూచనలిస్తారు.

రైతులకు ఎంతో మేలు



ప్రస్తుతం రైతు వేదికలో ఏర్పాటు చేస్తున్న ఆధునిక సాంకేతిక వ్యవస్థ ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరనుందని బషీరాబాద్ వ్యవసాయాధికారి సూర్యప్రకాష్ తెలిపారు. రైతులు ఎప్పటికప్పుడు ప్రతీ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో పంటసాగులో మెలకువల గురించి తెలుసుకునే ఆవకాశముంటుందన్నారు. తద్వారా వ్యవసాయంతో పాటు ఉద్యాన, పట్టు, మత్స్య, పశుసంవర్ధక, విద్యుత్, నీటిపారుదల శాఖలకు సంబంధించిన సమాచారం తెలుసుకునే వీలుంటుంది. త్వరలో ఈ సౌకర్యం రైతులకు అందుబాటులోకి రానుంది.

సూర్యప్రకాష్, వ్యవసాయాధికారి, బషీరాబాద్ మండలం

'ప్రజావాణి'లో మార్పులు

» ఇకపై డివిజన్ కేంద్రంలో ఫిర్యాదుల స్వీకరణ

» నేడు తాండూరు ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి

» డివిజన్ స్థాయి అధికారుల హాజరు తప్పనిసరి

తాండూరు, జూన్ 30: ఆర్నేళ్లుగా నిలిచిపోయిన ప్రజావాణి కార్యక్రమం కొత్త మార్పులతో మళ్లీ ప్రారంభమవుతోంది. గతానికి భిన్నంగా ప్రస్తుతం ఈ కార్యక్రమం కొనసాగనుంది. మండల, డివిజన్ మున్సిపాలిటీ స్థాయిలో ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరించనున్నారు. ఇప్పటికే 'ప్రజావాణి' కార్య క్రమాన్ని నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు అందాయి. ప్రతీ సోమవారం జిల్లాస్థాయిలో నిర్వహించడంతో పాటు ఇక మీదట మండల, డివిజన్ మున్సిపల్ స్థాయిలో నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీఅయ్యాయి. గతంలో మండల, జిల్లా, మున్సిపల్ స్థాయిలో నిర్వహించినప్పటికీ నామామాత్రంగా నిర్వహించారు. సోమవారం (జూలై1) నుంచి నిర్వహించే 'ప్రజావాణి'ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. తాండూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయ ప్రజావాణి ఉండేది కాదు. ప్రస్తుతం సోమవారం నుంచి డివిజన్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించాలని డీఎల్‌పీవో, వ్యవసాయ శాఖ ఏడీ, ట్రాన్స్‌కో, ఆర్టీసీ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖ ఈఈ, డీఈఈ, సీడీపీవో శాఖల డివిజన్‌స్థాయి అధికారులందరూ హాజరుకావాలని ఆదేశించారు. ఎంఎస్‌ఏవో, మండల స్థాయి అధికారులతో ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ ప్రజావాణి నిర్వహించాలని పేర్కొన్నారు. గతంలో తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించేవారు. తాజాగా ప్రభుత్వం మున్సిపాలిటీస్థాయిలో సంబంధిత శాఖల అధికారులతో కలిసి మున్సిపల్ స్థాయిలో నిర్వహించాలని ఆర్డర్‌లో పేర్కొంది.

సీపీఎం బలోపేతానికి పాటుపడాలి

» పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాములు



తమ్మలోనిగూడలో యాచారం మండల సీపీఎం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాములు

యాచారం, జూన్ 30 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటాలు చేస్తూ పార్టీని నిర్మాణాత్మకంగా బలోపేతం చేయడానికి ప్రతీ కార్యకర్త పాటుపడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రాములు పిలుపునిచ్చారు. ఆదివారం మండల స్థాయి రాజకీయ రాజకీయ శిక్షణా శిబిరం తమ్మలోనిగూడలో నిర్వహించగా.. రాములు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇకపై బూత్‌లవారీగా సమావేశాలు ఏర్పాటుచేసి పార్టీ బలోపేతం చేయడంపై కార్యాచరణ రూపొందించి ముందుకు సాగాలన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేరుతాయనే విశ్వాసం ప్రజలకు లేదన్నారు. రూ.500లకే వంట గ్యాస్ అందడం లేదని విమర్శించారు. మహిళలకు బస్సుల్లో ఉచిత రవాణా వసతి ఉన్నా.. సరిపడా బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరో నాలుగు రోజులుపోతే ఎంపీటీసీల కాల పరిమితి ముగుస్తుందని, జనం గోడు తీర్చేదెవరో తెలియని దుస్థితి నెలకొందని అన్నారు. రాష్ట్రంలో చాలాచోట్ల పంచాయతీలలో నిధులు లేక.. కనీసం పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇవ్వడం లేదని చెప్పారు. ధరణి పోర్టల్ కారణంగా గత ప్రభుత్వ కాలం నుంచి నేటికీ పేద, మధ్యతరగతి రైతులకు రైతుబంధు సాయం అందడం లేదనే విషయం పాలకులు ఎందుకు గమనించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా కింద కేవలం చిన్న, సన్నకారు రైతులకు మాత్రమే సాయం అందిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా అర్హులకు రేషన్‌కార్డులు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని జిల్లా రైతు సంఘం కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి. సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహులు విమర్శించారు. ఇళ్లు లేని పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థకు చేరిన పాఠశాలల గదులను కూల్చి.. కొత్తగా గదులు నిర్మించాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు పగడాల యాదయ్య. పి.అంజయ్య. పి.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇక సర్కారు వారి 'మీ సేవ'లు

» మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణ

» ఇంటర్మీడియట్ విద్యార్హత » వార్డు, గ్రామ స్థాయిలో ఏర్పాటు

» శిక్షణానంతరం ఆగస్టు 15 తర్వాత ఏర్పాటు



తాండూరు, జూన్ 30: మహిళా సంఘాలకు సర్కారు మరో అధికారాన్ని అప్పగించనుంది. పల్లె, పట్టణాల్లో మీసేవా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. మెప్మా, ఐకేపీల ఆధ్వర్యంలో ఈ కేంద్రాలు కొనసాగనున్నాయి. ఆగస్టు 15 తర్వాత ఈ కేంద్రాలు తెరుచుకోనున్నాయి. మహిళా సంఘాల్లో ఉన్న మహిళా సభ్యులకు ఇంటర్మీడియట్ విద్యార్హతతో ఈ నియమాకాలుంటాయని అధికారులు పేర్కొంటున్నారు. మండలంలో గ్రామం యూనిట్‌గా మున్సిపాలిటీల్లో వార్డు యూనిట్‌గా ఈ మీసేవా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతీ గ్రామంలో ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మహిళాశక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల సభ్యులకు అప్పగిస్తారు. ఈ కేంద్రాల ద్వారా పలు రకాల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌సేవలు, దరఖాస్తులు, చెల్లింపులు సహా 150పైగా ప్రభుత్వ సేవలు, 600కు పైగా ప్రైవేట్ సేవలకు గ్రామీణ ప్రాంతాలకు తమ గ్రామంలోనే చేసుకోవచ్చు. సమయం ఆదాతో పాటు ఆర్థికంగా గ్రామీణులకు కలిసివస్తుంది. విలేజ్ ఆర్గనైజేషన్ పేరిట మహిళా శక్తి మీసేవా కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేస్తోంది. స్త్రీనిధి ద్వారా మీసేవా కేంద్రం ఏర్పాటుకు రూ.2.50లక్షల రుణాన్ని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంజూరు చేస్తుంది. ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో గుర్తింపు పొందని సంస్థల నుంచి కంప్యూటర్లు, ప్రింటర్లు, జీపీఎస్, బయోమెట్రిక్, సామగ్రి, కెమెరా, ఇంటర్నెట్ కనెక్షన్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీ ప్రభుత్వ స్కూల్స్, రైతువేదిక, అంగన్‌వాడీ అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాల్లో ఈకేంద్రాలను ఏర్పాటు చేస్తారు. కేంద్రం నిర్వహణ, సేవలపై వారికి శిక్షణ ఇస్తారు. ఎంపికైన సంఘాలతో మీసేవా సంస్థ అవగాహన ఒప్పందం కుదుర్చుకోనుంది. ప్రభుత్వం నిర్ధేశించిన ధరల మేరకు పారదర్శకంగా సేవలను అందిస్తారు. మీసేవా కేంద్రాల నిర్వహణకు నియమించిన అధికారుల పర్యవేక్షణలో ఈ కేంద్రాలుంటాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మోమిన్‌పేట్, జూన్ 30: మోమిన్‌పేట్, మర్పల్లి మండలాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 33 కేవీ సదాశివపేట్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్‌జీటీ ఖాళీలన్నీ బదిలీల్లో చూపించాలి

» టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రత్నం

వికారాబాద్, జూన్ 30: ఎస్‌జీటీ తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయులు బదిలీలకు వేలాది పోస్టులకు బ్లాక్‌చేసి అప్రకటిత రేషనలైజేషన్ చేయడాన్ని టీఎస్ యూటీఎఫ్ వికారాబాద్ జిల్లా తీవ్రంగా ఖడిస్తుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరత్నం, పవన్ కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం రేషనలైజేషన్‌పై విధాన పరమైన నిర్ణయం తీసుకోకుండా విద్యార్థుల సంఖ్యను అనుసరించి అదనపు పోస్టులను బ్లాక్ చేసిన విద్యాశాఖ అవసరమైన పాఠశాలలకు అదనపు పోస్టులను మాత్రం కేటాయించడం లేదన్నారు. బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ లోని లేని హేతుబద్ధీకరణ యస్జీటీ బదిలీల మధ్యలో చూపించి కేవలం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మాత్రమే అమలు చేయడం తగదన్నారు. కోర్టు కేసులను బూచిగా చూపి వేల సంఖ్యలో ఉండే ఎస్జీటీలకు ఆప్షన్ గడువును ఒక్కరోజే ఇచ్చి హడావుడిగా ముగించాలని చూడడం సమంజసం కాదన్నారు. సినియారిటీ జాబితాల్లో తప్పులు సవరించడకుండా ఖాళీలను పూర్తి స్థాయిలో చూపించకుండా జరిపే బదిలీలను నిలిపి వేయాలని, విద్యాశాఖ అసమర్థత అసమగ్ర విధానాలు బదిలీలు, పదోన్నతులు ప్రక్రియ ఏడాదిన్నరగా సాగతీతకు కారణమైందన్నారు. వేల మంది ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సిలింగ్ సక్రమంగా నిర్వహించలేక పోవడం ఏమిటని ప్రశ్నించారు. అసరమైతే ప్రక్రియను రెండు రోజులు వాయిదా వేసి సమస్యలన్నీ సానుకూలంగా పరిష్కరించి, పొరపాట్లను సవరించి పారదర్శకంగా వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

బొంరాస్‌పేట్: ఎస్‌జీటీ తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయుల బదిలీలకు వేలాది పోస్టులను బ్లాక్ చేసి అప్రకటిత రేషనలైజేషన్ చేయడాన్ని యూటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు గౌరారం గోపాల్, నరేందర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో ఖండించారు. రేషనలైజేషన్‌పై విధానపరమైన నిర్ణయం తీసుకోకుండా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు పోస్టులను బ్లాక్ చేసిన విద్యాశాఖ అవసరమైన పాఠశాలలకు అదనపు పోస్టులను మాత్రం కేటాయించడం లేదని ఆరోపించారు. బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌లో లేని హేతుబద్ధీకరణను మధ్యలో చొప్పించి కేవలం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మాత్రమే అమలు చేయడం గందరగోళానికి గురిచేస్తోందన్నారు. కోర్టు కేసులను బూచిగా చూపి వేల సంఖ్యలో ఉండే ఎస్‌జీటీలకు ఆప్షన్ గడువును ఒక్కరోజే ఇచ్చి హడావుడిగా ముగించాలని చూడటం సరైంది కాదన్నారు.

నిర్వహణ లేక.. శిథిలావస్థలో ట్యాంకు

బొంరాస్‌పేట్, జూన్ 30: దశాబ్దాల కిందట నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. నిర్వహణ లోపం కారణంగా పిచ్చిమొక్కలు పెరిగి వాటి వేర్లు ట్యాంకుల్లోకి వెళ్లి పగుళ్లు చూపాయి. పంచాయతీలో ప్రత్యేకాధికారుల పాలనలో పట్టింపు కరువైంది. మండల కేంద్రంలోని ఐబీ అతిథి గృహం వెనుక నిర్మించిన ట్యాంకులపై మర్రి మొక్కలు మొలిచాయి. వాటి వేర్లు ట్యాంకు పైభాగంలో చుట్టూ ఆక్రమించాయి. వాటితో పగుళ్లు ఏర్పడి శిథిలావస్థకు చేరాయి. దీంతో పాటు ట్యాంకులో పక్షులు పడినా చూసే దిక్కులేదు. ఈ విషయంపై ఇప్పటికే పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వాటిని తొలగించడం లేదని నీటిట్యాంకు పక్కనే నివాసముంటున్న ఎండీ. మొహ్మద్ తెలిపాడు. ఎప్పటికప్పుడు ట్యాంకులపై పిచ్చి మొక్కలను తొలగిస్తూ పరిశుభ్రంగా ఉంచితే బాగుంటుందని తెలిపారు. ఇప్పటికే గ్రామానికి చివరన ఉన్న మాలగుట్టపై నిర్మించిన మరో ఓహెచ్ఎస్ఆర్ సైతం లీకేజీలతో శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బొంరాస్‌పేట్‌లో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుపై మొలిచిన పిచ్చి మొక్కలు

షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా విజయ్ కుమార్



షాద్‌నగర్ రూరల్, జూన్ 30: షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా విజయ కుమార్ బదిలీపై వచ్చారు. ఇంతకు ముందు ఇక్కడ పని చేసిన ప్రతాప్ లింగం బదిలీ అయ్యారు. ఆయన సైబరాబాద్ కమిషనరేట్‌కు బదిలీ కాగా, సైబరాబాద్‌లో ఎకనామిక్స్ అఫెండెక్స్ వింగ్‌లో పనిచేస్తున్న విజయకుమార్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

గ్లాస్ పరిశ్రమ ఘటన అనుమానాలను నివృత్తి చేయాలి



శ్రీనివాస్

షాద్‌నగర్ రూరల్, జూన్ 30: ఫరూఖ్‌నగర్ మండ లం బూర్గుల శివారులోని సౌత్ గ్లాస్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో నిజానిజాలను ప్రజలకు నివృత్తి చేయాలని బీఎస్పీ షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటన డిమాండ్ చేశారు. ఐదుగురు కార్మికులు చనిపోయి, పది మంది కార్మికులు గాయపడితే కంపెనీ, యజమానిపై కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. యజమాని నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఇప్పటివరకు పరిశ్రమ యజమానిని అరెస్ట్ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. పొట్ట చేత పట్టుకుని వందల కిలో మీటర్లు వలస వచ్చిన కార్మికుల చావులకు బాధ్యులెవరని ఆయన పేర్కొన్నారు. బాధితులకు తక్షణమే పరిహారం ఇప్పించేందుకు కృషి చేయాలని కోరారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- గవర్నర్‌కు మాజీ సర్పంచ్‌ల వినతి



గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్‌ల సంఘం నాయకులు

కడ్తాల్, జూన్ 30: గ్రామ పంచాయతీలలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేలా చూడాలని తాజా మాజీ సర్పంచ్‌లు రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్‌ను కోరారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యల ఆధ్వర్యంలో వివిధ జిల్లాల మాజీ సర్పంచ్‌లు గవర్నర్‌ను కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. 2019 నుంచి 2024 వరకు గ్రామాలలో ప్రభుత్వ ఆదేశానుసారం అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఆదర్శవంతమైన గ్రామ పంచాయతీలుగా గ్రామాలను తీర్చిదిద్దడంలో తమ వంతు కృషి చేయడం జరిగిందని తెలిపారు. గ్రామ పంచాయతీలలో ప్రజల సౌకర్యార్థం వీధిలైట్ల నిర్వహణ, అంతర్గత మురుగు కాల్వల ఏర్పాటు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, వైకుంఠధామాలు, పల్లె ప్రగతి, తాగునీటి పథకాల నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు పనులకు సంబంధించి మాజీ సర్పంచ్‌లకు లక్షల రూపాయాలు రావాల్సి ఉందని లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఏడాది కాలంగా గత, ప్రస్తుత ప్రభుత్వాలపై పెండింగ్ బిల్లుల చెల్లింపు గూర్చి ఒత్తిడి తేవడం జరుగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలైనా పెండింగ్ బిల్లులను చెల్లించకపోవడం వల్ల తాజా మాజీ సర్పంచ్‌లు మనోవేదనకు లోనవుతున్నారని ఆయన అన్నారు. అదేవిధంగా పనులకు చేసిన అప్పుల భారంతో అనేక మంది తాజా మాజీ సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకోవడం జరిగిందని లక్ష్మీనర్సింహారెడ్డి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వానికి పెండింగ్ బిల్లుల చెల్లింపు గూర్చి అనేకమార్లు విన్నవించినా ఎలాంటి స్పందన లేదని వాపోయారు. పెండింగ్ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా త్వరగా అందించేలా చొరవ తీసుకోవాలని గవర్నర్‌ను కోరగా సానుకూలంగా స్పందించినట్లు లక్ష్మీనర్సింహారెడ్డి, యాదయ్యలు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు సుభాష్, లక్ష్మీప్రసన్నరెడ్డి, గణేశ్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

నకిలీ సర్టిఫికెట్ల బాగోతం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన మంచాల తహసీల్దార్
- కేసు నమోదు.. కొనసాగుతున్న దర్యాప్తు



మంచాల తహసీల్దార్ కార్యాలయం

మంచాల, జూన్ 30 : నకిలీ సర్టిఫికెట్ల బాగోతం మంచాల తహసీల్దార్ కార్యాలయంలో వెలుగులోకొచ్చింది. ఈ ఘటనపై తహసీల్దార్ ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మంచాల తహసీల్దార్ కార్యాలయంలో షేక్ సమీర పేరిట 19 మార్చి 2024న ఆదాయ ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. ఆమె విదేశాల్లో చదువు నిమిత్తం ఈ సరిఫికెట్‌ను జతపరుస్తూ రాష్ట్ర మైనారిటీ వెల్ఫేర్ సొసైటీకి సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో భాగంగా మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ నుంచి ఆదాయ ధ్రువీకరణ పత్రంపై నిజనిర్ధారణకు వారం రోజుల క్రితం తహసీల్దార్ ప్రసాద్‌రావుకు ఉత్తర్వులందాయి. ఆయన సర్టిఫికెట్‌పై క్షేత్ర పరిశీలనను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అప్పగించారు. రెవెన్యూ అధికారులు జారీచేసిన సర్టిఫికెట్ ప్రకారం ఉన్న చిరునామాకు వెళ్లగా ఆ అడ్రస్‌లో షేక్ సమీర పేరుతో ఎవరూ లేరని తేలింది. దీంతో ధ్రువీకరణ పత్రం జారీ వివరాలను తహసీల్దార్ కార్యాలయంలోని కంప్యూటర్ విభాగంలో తనిఖీ చేశారు. అందులో ఆన్‌లైన్ ఇన్‌వార్డు ఎంట్రీలో ఎటువంటి రాతపూర్వక పత్రాలు అప్‌లోడ్ కాలేదు. ఈ క్రమంలో దరఖాస్తులో ఉన్న ఫోన్‌నంబర్‌ను క్లిక్‌చేయగా ఇదే నంబర్‌తో మరిన్ని దరఖాస్తులు సిస్టంలో చూపారు. ఇలా అప్లై చేసిన దరఖాస్తులన్నింటిని ఆన్‌లైన్ అప్లికేషన్ స్థానికంగా కాకుండా నగర శివారు వివిధ ప్రాంతాల్లోని మీసేవ కేంద్రాల నుంచి దరఖాస్తు చేసినట్టు నిర్ధారించారు. సదరు ఫోన్‌నంబర్‌తో గతంలో జారీ చేసిన ఆదాయ సర్టిఫికెట్ తప్పుడు సర్టిఫికెట్‌గా నిర్ధారించిన తహసీల్దార్.. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై మంచాల ఎస్సై రవినాయక్ మాట్లాడుతూ నకిలీ సర్టిఫికెట్ల జారీ వ్యవహారంపై తహసీల్దార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని చెప్పారు. ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా తహసీల్దార్ కార్యాలయంలో ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సురేష్, నగర శివారు మీసేవ కేంద్రం నిర్వాహకుడు రాజు, దరఖాస్తుల్లో భాగస్వాములుగా ఉన్న మరో ఇద్దరిపై కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితులంతా పరారీలో ఉన్నారని, వారిని అదుపులోకి తీసుకుని విచారించి పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. ఈ నకిలీ బాగోతంపై తహసీల్దార్ ప్రసాద్‌రావు మాట్లాడుతూ సర్టిఫికెట్ల జారీలో చోటుచేసుకున్న అవకతవకలపై ఆర్డీవో, కలెక్టర్లకు నివేదికిచ్చామని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తదుపరి ఉత్తర్వుల ప్రకారం చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతం.. యువకుడు మృతి



మృతిచెందిన అశోక్‌కుమార్

శంషాబాద్, జూన్ 30 : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ఓ టైలర్ షాపుకు ఫ్లెక్సీ కడుతుండగా విద్యుత్ షాక్ తగలడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఆర్జీఐఏ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఊట్‌పల్లి బస్తీలో నివాసముండే అశోక్‌కుమార్(23) శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని ఓ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేసేవాడు. ఈక్రమంలో అతడు విధులకు వెళుతుండగా.. శంషాబాద్-షాబాద్ రోడ్డులో ఉన్న ఓ టైలర్‌షాపు వద్దకు వెళ్లాడు. అక్కడ షాపు ఓనర్ తన దుకాణానికి సంబంధించిన ఫ్లెక్సీ కట్టమని కోరాడు. అశోక్‌కుమార్ ఫ్లెక్సీ తీసుకొని కడుతుండగా.. విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య మేనక టైలర్ షాపు యాజమాని తగిన జాగ్రత్తలు తీసుకోకుండా తన భర్తను ఫ్లెక్సీ కట్టమని చెప్పినందునే విద్యుత్‌షాక్ తగిలి మృతిచెందాడని ఆరోపించింది. ఈమేరకు షాపు యజమానిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు సీఐ బాల్‌రాజ్ తెలిపారు. కేసు ఆర్జీఐఏ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. తప్పిన పెను ప్రమాదం

షాద్‌నగర్, జూన్ 30 : రోడ్డు మూల మలుపు వద్ద ట్రాక్టర్ బోల్తాపడిని ఘటన ఫరూఖ్‌నగర్ మండలం నాగులపల్లి నుంచి షాద్‌నగర్ వెళ్లే రోడ్డు మార్గంలో చోటుచేసుకుంది. ఫరూఖ్‌నగర్ దాటిన తర్వాత వైకుంఠ ధామం సమీపంలో ఉన్న మలుపు ప్రమాదకరంగా ఉంది. మలుపులో ఒక చోట రోడ్డు రెండు వైపులా కొట్టుకు పోయింది. దాంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం ఉదయం మలుపు వద్ద అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తాపడింది. కాగా, ప్రాణ నష్టం ఏమీ జరగలేదు. రోడ్డు రెండు దెబ్బతిందని నాగులపల్లి గ్రామస్తులు తెలిపారు. రాత్రి పూట వాహనాల్లో వెళ్లాలంటే భయమేస్తోందని ఆందోళన చెందుతున్నారు. మలుపుల వద్ద చెట్లు ఏపుగా పెరగడంతో వాహనాలు కనిపించడం లేదని తెలిపారు.

హరీశ్‌రావును కలిసిన ఉప్పల



హరీశ్‌రావును సన్మానిస్తున్న ఉప్పల వెంకటేశ్

తలకొండపల్లి, జూన్ 30: మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావును ఆదివారం తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితుల గూర్చి హరీశ్‌కు వివరించినట్లు వెంకటేశ్ తెలిపారు. ఆయన్ను కలిసిన వారిలో ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్, నాయకులు నరేశ్‌గౌడ్, ప్రశాంత్, కోటేశ్, బుచ్చిబాబు, తదితరులు ఉన్నారు. అదేవిధంగా అచ్చంపేట మాజీఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్‌ను వెంకటేశ్ కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజారోగ్యమే పరమావధిగా పనిచేయాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూన్ 30: దేవుడు జన్మనిస్తే... వైద్యులు పునర్జన్మ నిస్తారు... అలాంటి పవిత్రమైన వృత్తిలో ఉన్న వైద్యులందరూ ప్రజారోగ్యమే పరమావధిగా పనిచేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆకాంక్షించారు. షాద్‌నగర్ బుగ్గారెడ్డి ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఐ.అనురాగ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన మెగా హెల్త్‌క్యాంప్-హెల్త్ కార్డుల జారీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు. షాద్‌నగర్‌లో బుగ్గారెడ్డి పేరుతో ఆసుపత్రిని ఏర్పాటు చేసి, మెరుగైన వైద్య సేవలను అందించడమే కాకుండా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అన్ని వార్డులను దృష్టిలో పెట్టుకుని రాయితీపై వైద్య సేవలను అందించడానికి హెల్త్ కార్డులను ఇవ్వడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలకు సైతం సొంత డబ్బులతో హెల్త్‌కార్డులను ఇస్తానని వీర్లపల్లి శంకర్ ప్రకటించారు. డాక్టర్ అనురాగ్‌రెడ్డి మాట్లాడుతూ 20 మంది స్పెషలిస్టుల వైద్య బృందం పనిచేసిన వైద్య శిబిరంలో 700 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, కావాల్సిన వారికి మందులను పంపిణీ చేశామని తెలిపారు. అలాగే ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించామన్నారు. శిబిరాన్ని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు సందర్శించారు.

అర్హులు 'గృహజ్యోతి'కి దరఖాస్తు చేసుకోవాలి

చేవెళ్ల, జూన్ 30 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం వర్తింపునకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని చేవెళ్ల మండల విద్యుత్ ఏఈ జానీ మొయినొద్దీన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఉచితంగా 200 యూనిట్ల వరకు అందిస్తున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా, ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు ఆధార్‌కార్డు, విద్యుత్ బిల్లు, రేషన్ కార్డు తదితర జిరాక్స్ పత్రాలను చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయంలో అందించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్నవారికి 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ బిల్లు వర్తింప జేయబడుతుందని ఆయన తెలిపారు.

కిష్టమ్మ మృతికి సంతాపం



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, జూన్ 30: మండల పంచాయతీ రాజ్ ఏఈ కృష్ణయ్య, తెలంగాణ ఉద్యమ కారుడు స్కైలాబ్ మాతృమూర్తి కిష్టమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం వెల్దండలో భౌతికకాయాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంతాపం తెలిపిన వారిలో మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ జ్యోతినిరంజన్, నాయకులు నిరంజన్, చంద్రమోహన్‌రెడ్డి, ఆనంద్, ముధుసూధన్ రెడ్డి, నాగేశ్, ప్రవీణ్, శ్రీను, గణేశ్, తదితరులు ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే యాదయ్య



రామ్మోహన్‌రెడ్డితో యాదయ్య

చేవెళ్ల, జూన్ 30 : ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆదివారం డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డిని ఆయన శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా డీసీసీ అధ్యక్షుడిని కలిసినట్లు ఈసందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.

విశ్వగురువు.. ప్రధాని నరేంద్ర మోదీ



అజీజ్‌నగర్‌లో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

మొయినాబాద్ రూరల్, జూన్ 30: ప్రధాని నరేంద్ర మోదీ విశ్వగురువు అని బీజేపీ మొయినాబాద్ మండల ప్రధాన కార్యదర్శి తూర్పు మాధవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో బీజేపీ శ్రేణులు మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. అదేవిధంగా జన్‌సంఘ్ వ్యవస్థాకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్సీ మోర్చా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, బాలకృష్ణ గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని సేవలందించేందుకే మన్‌కీ బాత్

యాచారం : దేశప్రజలకు మరిన్ని సేవలందించడం కోసమే ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కిసాన్‌మోర్చా రాష్ట్రమాజీ అధ్యక్షుడు కొప్పు బాషా తెలిపారు. ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని మండల బీజేపీ నాయకులు మండల కేంద్రంలో తిలకించారు. కేంద్రప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాలను దేశప్రజలందరికి అందించడానికి మన్‌కీ బాత్ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఆయన అన్నా రు. బీజేపీ మండలాధ్యక్షుడు తాండ్ర రవీందర్, నాయకులు గొల్లపల్లి జంగయ్యగౌడ్, బీరప్ప, శ్రీకాంత్, సాయి, సంజీవ తదితరులున్నారు.

నేడు ఎమ్మెల్సీకి సన్మాన కార్యక్రమం

ఆమనగల్లు, జూన్ 30: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందిన నవీన్ కుమార్‌రెడ్డికి నేడు(సోమవారం) ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మీగార్డెన్‌లో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ తెలిపారు. అదేవిధంగా జూలై 4తో పదవీ కాలం ముగుస్తున్న కల్వకుర్తి నియోజకవర్గంలోకి ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని వెంకటేశ్ కోరారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

తలకొండపల్లి, జూన్ 30: మండల పరిధిలోని మెదక్‌పల్లి గ్రామానికి చెందిన అల్వాల చెన్నమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని ఆదివారం జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ పరామర్శించారు. అనంతరం చెన్నమ్మ కుటుంబ సభ్యులకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆయన రూ.3వేలు సమకూర్చగా స్థానిక నాయకులు అందజేశారు. పరామర్శించిన వారిలో నరేశ్, శంకర్, ఈశ్వర్‌గౌడ్, సత్యనారాయణ, మల్లయ్య, రాజు, పాండు, శ్రీకాంత్, రమేశ్, శ్రీను తదితరులు ఉన్నారు.

3న పీఏసీఎస్ సమావేశం

తలకొండపల్లి, జూన్ 30: మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రత్యేక సర్వసభ్య సమావేశం జూలై 3న మధ్యాహ్నం 2 గంటలకు పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సీఈవో ప్రతాప్‌రెడ్డి తెలిపారు. చైర్మన్ కేశవరెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో రైతు భరోసా అమలు, సంఘం ద్వారా రుణాలు, పీఏసీఎస్ బలోపేతంపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. పీఏసీఎస్ డైరెక్టర్ సకాంలో హాజరుకావాలని కోరారు.





ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చేవెళ్ల : పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు



యాచారం : సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, గురువులు

యాచారం/షాబాద్/చేవెళ్ల, జూన్ 30 : తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల కారణంగా నేడు మేము ఉన్నత స్థానంలో ఉన్నామని పూర్వ విద్యార్థులు అన్నారు. యాచారం మండలంలోని మేడిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 2008-09 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం మల్కీజ్‌గూడలోని ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. తమ గురువులను ఘనంగా సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. పాఠశాల ఉన్నతి కోసం పాటుపడతామని చెప్పారు. ఆనాటి గురువులు గోవర్ధన్. రమాదేవి, కొండయ్య, ఆర్థశ్రీ, జయమ్మ, రాజులతో పాటు ఆనాటి విద్యార్థులు బన్నె శ్రీశైలం, సురేష్ తదితరులున్నారు. సమాజ నిర్మాతలే ఉపాధ్యాయులని, గురువు లేని విద్య గుడ్డిదని పూర్వ విద్యార్థులు అన్నారు. షాబాద్ మండలం తాళ్లపల్లి జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైర్డ్ అయిన బురాన్ ప్రభుదయాల్ రిటర్మెంట్ ఫంక్షన్ ఆదివారం నాగర్‌గూడలో ఓ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈమేరకు 1990 నుంచి 1997 టెన్త్ బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు కార్యక్రమం ఏర్పాటు చేశారు. టీచర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్లు నర్సింహులు, రాంరెడ్డి, పూర్వ విద్యార్థులు మేకల శ్రీనివాస్, ఇస్మాయిల్, ఆనంద్‌చారి, జంగయ్య, మాధవి, శేఖర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే చేవెళ్ల మండల పరిధిలోని దేవునిఎర్రవల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97లో 7వ తరగతి చదువుకున్న విద్యార్థులంతా సమ్మేళనం జరుపుకున్నారు. గ్రామంలోని ఓ ఫామ్‌హౌస్‌లో కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు.



షాబాద్ : విద్యార్థులతో ఉపాధ్యాయులు